

నుజ్జునుజ్జయిన డీసీఎం క్యాబిన్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన డీసీఎం

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- పెద్దఅంబర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై ఘటన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై ఆగి ఉన్న లారీని డీసీఎం ఢీకొట్టడంతో డీసీఎం క్యాబిన్‌లో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యపేట జిల్లా నాగారం మండలం పస్నూర్ గ్రామానికి చెందిన చిత్తలూరి గణేష్(23) ఎల్బీనగర్‌లోని రాజేష్‌గౌడ్‌కు చెందిన దుర్గా ఫైర్ వర్క్స్‌లో నాలుగు నెలలుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఎల్బీనగర్‌లోని ఫైర్ షాపు నుంచి బాణాసంచాను డీసీఎంలో తీసుకుని ఘట్‌కేసర్‌లో అన్‌లోడ్ చేసేందుకు వెళ్లాడు. అతడితో పాటు సతీష్, సందీప్, మహేష్ ముగ్గురు కార్మికులు ఉన్నారు. అయితే ఘట్‌కేసర్‌లో బాణాసంచా అన్‌లోడ్ చేసిన అనంతరం తిరిగి ఓఆర్‌ఆర్ మీదుగా మహేశ్వరంలోని గోదాంకు వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న డీసీఎం అర్ధరాత్రి 3.30కు పెద్దఅంబర్‌పేట్ టోల్ ప్లాజా సమీపంలోకి చేరుకుంది. అదే సమయంలో ఔటర్‌పై ఓ లారీ రోడ్డు పక్కనే ఆగి ఉంది. దాన్ని గమనించని సీపీఎం డ్రైవర్ రమేష్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దాంతో డీసీఎంలో కూర్చున గణేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకాల ఉన్న సందీప్, సతీష్‌లకు గాయాలు కాగా వారిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు

సైదాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి ముందస్తు సంబరాలను బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు యాదవ్ ఆధ్వర్యంలో సైదాబాద్ మాతృశ్రీ కాలనీలోని ఎస్‌వీవీ హైస్కూల్ అవరణలో ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారుల బతుకమ్మ ఆట, దాండియా నృత్యాలు అందరినీ అకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రచారం

చాదర్‌ఘాట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపే లక్ష్యంగా మలక్‌పేట పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించాలని పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ ఆజంఅలీ పిలుపునిచ్చారు. ఆదివారం ఆజంపురలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని తిరిగి బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి దివంగత మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా చేసిన సేవలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత భారీ మెజార్టీతో గెలిచేలా మలక్‌పేట నియోజకవర్గం కార్యకర్త లు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని ఆజంఅలీ కోరారు. ఈ ఉప ఎన్నికలు బీఆర్‌ఎస్‌కి అనుకూలంగా ఉన్నాయని, కాంగ్రెస్ పట్ల ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారన్నారు. ఈ పరిస్థితులను సునీతకు అనుకూలంగా మలచుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు.

ఎన్‌ఐఐఎంహెచ్‌లో ధన్వంతరి జయంతి

సైదాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని ఆయుష్ మంత్రిత్వశాఖ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్‌ఐఐఎంహెచ్)లో 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆదివారం ధన్వంతరి జయంతిని నిర్వహించారు. సంస్థ అవరణలో ఉదయం ధన్వంతరి హోమం, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లకు, విద్యార్థులకు అయుర్వేదం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



నిందితులు రియాజ్, విజయ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

చిన్నారులపై అఘాయిత్యం కేసులో నిందితుల అరెస్ట్

సైదాబాద్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... సైదాబాద్ పీఎస్ పరిధిలో నివాసముంటున్న ఇద్దరు అక్కచెల్లెళ్లు (10, 9) వయస్సు, మరో బాలిక(9) ఆగస్టులో స్కూల్ సెలవులలో ఇంటి ముందు ఆడుకుంటుండగా పొరుగున ఉండే నిందితుడు రియాజ్ (36) ముగ్గురు బాలికలను చాక్లెట్ ఇస్తానని ఇంట్లోకి పిలిచాడు. ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ వరుసగా ముగ్గురిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో తల్లిదండ్రులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో..

ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారం చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైదాబాద్ ప్రాంతంలో ఓ మహిళ భర్తతో విభేదించి కూతురు(15)తో కలిసి ఉంటుంది. తరచుగా ఓ యువకుడు ఇంటికి వచ్చి, కూతురితో మాట్లాడి పోతున్నాడని పొరుగువారు తల్లికి చెప్పారు. దీంతో తల్లి కూతురుని నిలదీసింది. ఏడాది క్రితం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో విజయ్ తనను బెదిరించి అత్యాచారం చేశాడని, తీసిన ఫొటోలు కుటుంబసభ్యులకు పంపుతానని బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు అత్యాచారం చేశాడని వివరించింది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైదాబాద్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చాదర్‌ఘాట్, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి: దసరా, దీపావళి పర్వదినోత్సవాలను పురస్కరించుకుని గడ్డిఅన్నారంలోని ఉమెన్స్ వరల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు బి.ఇందిర సి.సంయుక్త సి.రాధ, మాధురి, శిరీష సంయుక్తాధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమానికి గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గండి జగన్ యాదవ్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

22న కార్తీక వైభవం

వనస్థలిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని బుధవారం హయత్‌నగర్ డివిజన్ కార్తీక వైభవం ఉంటుంది.

నేరస్థుల పట్టివేతలో సీసీ కెమెరాలే కీలకం

ఎల్‌బీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నేరస్థులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపకరిస్తున్నాయని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ రోడ్ నంబర్ 7లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.







58 చలాన్ల ద్విచక్ర వాహనం సీజ్

వనస్థలిపురం, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): ట్రాఫిక్ నిబంధలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు అన్నారు. ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ సాగర్ కాంప్లెక్స్ వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా, సదరు వాహనంపై 58 చలాన్లు ఉన్నాయి.

ఆ వాహనదారుడు 58 సార్లు సాగర్ కాంప్లెక్స్ నుంచి గుర్రంగూడకు రాంగ్‌రూట్‌లో ప్రయాణించడంతో అక్కడ ఉన్న ఆటోమెటిక్ కెమెరాలతో చలాన్ల రూపంలో రూ.58,895 ను విధించినట్లు, సదరు వాహహనాన్ని సీజ్‌చేసి వనస్థలిపురం ట్రాఫిక్ పీఎస్‌కు తరలించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా పలుచోట్ల రోడ్లపై ఆటోమెటిక్ కెమెరాలు అమర్చామని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌కేపురం అధ్యక్షునిగా ఆకునూరి సాయికుమార్


ఎల్‌బీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌కేపురం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఆకునూరి సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన ఉపసంహరణల ప్రక్రియ అనంతరం నూతన నిర్వాహక కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మోహన్‌రెడ్డి ప్రకటించారు.

















పైప్ పగిలి.. నీరు వృథా..!



సైదాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై కృష్ణా మంచినీటి పైప్ పగిలిపోయింది. దీంతో సుమారు రెండు గంటల పాటు నీరు వృథాగా రోడ్లపై పారింది. సదర్ ఉత్సవాల సందర్భంగా కంట్రాక్టర్ ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు మరమ్మతులు చేపడుతుండగా పైప్‌లైన్ పగిలిపోయింది.




మట్టి ప్రమిదల అమ్మకాలు


గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


ప్రతిమలు కొనుగోలు చేస్తున్న మహిళలు


మామిడి ఆకులు కొనుగోలు చేస్తున్న మహిళ


అరటి దుంగలు, చెరకు గడల విక్రయాలు


టపాకాయల క్రయవిక్రయాలు

జోరందుకున్న దీపావళి అమ్మకాలు

బంతి, అరటి, చెరకు మస్తు గిరాకీ

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) మార్కెట్‌లో దీపావళి అమ్మకాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా పూజకు ఉపయోగించే వస్తువులు పెద్దఎత్తున కొనుగోళ్లు జరుగుతున్నాయి. మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల మీద ఎటుచూసినా బొమ్మలు, పూజకు ఉపయోగించే పూలు, అరటి చెట్లు, చెరకు గడలు పెద్దఎత్తున అమ్ముతున్నారు. రెండు చెరుకు గడలు (జత) రెండు వందలు, రెండు అరటి చెట్లు నాలుగు వందల చొప్పున విక్కయిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన రకరకాల బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీదేవి అమ్మవారి బొమ్మలు పెద్దఎత్తున అమ్ముడుపోతున్నాయి. రెండు వందల నుంచి మొదలుకొని ఐదు వందల రూపాయల వరకు అమ్ముతున్నారు. బంతి పూలు కుప్పలుగా పోసి కిలో వంద రూపాయలు పలుకుతున్నాయి. దీపావళి టపాసుల ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి.


బంతి పూల క్రయవిక్రయాలు



అరటి చెట్లు, చెరకు గడలు


అమ్మకానికి లక్ష్మీదేవి బొమ్మలు

రసాభాసగా మారిన డీసీసీ అధ్యక్షుడి అభిప్రాయ సేకరణ

ఎమ్మెల్యే రంగారెడ్డి.. మాజీ మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి మధ్య వాగ్వాదం

హయత్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికపై ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల అభిప్రాయ సేకరణ సమావేశం ఆదివారం తుర్కయంజాల్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో రసాభాసాగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ పరిశీలకుడు రాబర్ట్ బ్రూస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. పార్టీ అందరినీ సమానంగా చూస్తుందని, అందరూ ఏకాభిప్రాయానికి వచ్చి మంచి నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు. సమావేశానికి నియోజకవర్గం నుంచి ముఖ్య నాయకులకు మాత్రమే ఆహ్వానం అందగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. అభిప్రాయ సేకరణకు చీటీలు ఇచ్చి అభిప్రాయాలను సేకరించారు. పోటీ పడుతున్న నాయకుల పేర్లను కూడా తీసుకున్నారు.

సమావేశానికి ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి హాజరుకావడంతో సభలో గందరగోళం నెలకొంది. కొంత మంది కాంగ్రెస్ నాయకులు లేచి గో బ్యాక్ నిరంజన్‌రెడ్డి అని నినాదాలు చేయడంతో సభలో గందగోళం నెలకొంది. సస్పెండ్ చేసిన తరువాత ఎందుకు వచ్చారని కొందరు కార్యకర్తలు నిరంజన్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. దీంతో నిరంజన్‌రెడ్డిని సమావేశం నుంచి బయటకు పంపించారు. ఈ క్రమంలో నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యే రంగారెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ పరిశీలకుడు రాబర్ట్ బ్రూస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య సమక్షంలోనే ఎమ్మెల్యే రంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తీవ్ర పదజాలంతో దూషించుకున్నారు.

నిరంజన్‌రెడ్డి అక్కడ్నుంచి వెళ్లి పోవడంతో సమస్య సద్దుమనిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికపై జరుగుతున్న ఏకాభిప్రాయ సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానం అందినందుకే సమావేశానికి వచ్చానని మర్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యోగాలో అరుణకుమారికి కాంస్యం

ఎల్‌బీనగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగిన 50వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో కాంస్య పతకం సాధించిన రంగారెడ్డి జిల్లా యోగా క్రీడాకారిణి పి.అరుణకుమారిని జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. అక్టోబర్ 9 నుండి 12 వరకు మైసూర్‌లో జరిగిన పోటీల్లో అరుణకుమారి (45) గ్రూప్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించింది. దీంతో ఆదివారం తెలంగాణ యోగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్‌రెడ్డి ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నర్సింహగౌడ్, కార్యదర్శి అక్కినెపల్లి మంజుల, కోశాధికారి జడి రాజు, సంయుక్త కార్యదర్శి దుర్గం వినోద్‌కుమార్, కన్నం రాజశేఖర్, రాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సత్యానగర్‌లో ఔట్‌డోర్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఔట్‌డోర్ జిమ్ ప్రారంభం

కొత్తపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అందరి వ్యాయామం కోసమే ఔట్‌డోర్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. సత్యానగర్ పార్కులో ఏర్పాటు చేసిన ఔట్‌డోర్ జిమ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా స్థలంలో పిల్లల కోసం గ్రీనరీ సుందరీకరణ చేపట్టనున్నామన్నారు. సుమారు రూ.50 లక్షలతో పార్కులో /వాకింగ్ ట్రాక్ స్థలంలో సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వగ్గుల సుందర్ నారాయణ, డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్, ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.


డీజీపీ శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి డ్రగ్స్ నిర్మూలనకై వినతిపత్రం ఇచ్చిన బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి

డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

మన్సూరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్నే కబలిస్తోన్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టి డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఇంటలిజెన్స్ సీఐ వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు పిలుపునిచ్చారు. మన్సూరాబాద్ డివిజన్ మహవీర్ హరిణవనస్థలి నేషనల్ పార్కులో ఆదివారం బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై యువతకు అవగాహన కల్పించారు. 'డ్రగ్స్ అంతం,మన పంతం' నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పోలీస్ అధికారులు మహమ్మద్ మక్బూల్ జానీ, వెంకట్‌రెడ్డి, ఏడుకొండలు విచ్చేసి గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలు కుటుంబాలనే కాకుండా జీవితాన్ని నాశనం చేస్తాయని, చెడు వ్యసనాలకు పోకుండా యువత లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నతులు ఎదగాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ నిర్మూలనకు తమవంతు సహకారం ఉంటుందని డీజీపీ శివధర్‌రెడ్డిని కలిసి రాంరెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సదస్సులో భాగంగా తెలంగాణ గద్దర్ కాసాల నర్సిరెడ్డి డ్రగ్స్ నిర్మూలనపై ఆలపించిన పాట అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మహవీర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, పోచబోయిన జగదీష్‌యాదవ్, వెంకటేశ్వర్లుగౌడ్, కృష్ణగౌడ్, అమరేందర్‌రెడ్డి, సునీత, తదితరులు ఉన్నారు.


సాగర్ ప్రధాన రహదారి పైనుంచి దుర్గాభవానీకాలనీకి వెళ్లే దారిలో పేరుకపోయిన చెత్తకుప్పలు

డంపింగ్ యార్డ్‌గా మారిన సాగర్ ప్రధాన రహదారి

చంపాపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ సాగర్ ప్రధాన రహదారిపై దుర్గాభవానీ నగర్ కాలనీకి వెళ్లే దారి డంపింగ్ యార్డ్ గా మారింది. ప్రతిరోజు చెత్త, చెదారంను రహదారిపై వేస్తుండటంతో వాహనదారులు, బాటసారులు దుర్వాసన భరించలేక పోతున్నారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్‌కు చివరి కాలనీ కావడంతో రహదారిపై డస్టుబీన్ ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరు చెత్తను వేస్తున్నారు. దీంతో కాలనీలోకి వెళ్లే ప్రధాన ద్వారం దుర్వాసనతో కంపుకొడుతుంది. చెత్తను డస్టుబీన్‌లో వేయకుండా రహదారిపై వేస్తున్నారు. చెత్త, చెదారం వేయకుండా అక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌ను తరలించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు లట్టుపల్లి రమేష్ రెడ్డి తదితరులు జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు.


పద్మాలయ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శివారు కాలనీలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని పద్మాలయ కాలనీలో రూ.కోటితో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నర్సింలు, శేఖర్, రవీందర్‌రెడ్డి, అంజయ్య, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు పాటుపడదాం


వరదనీటి నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ విధిగా పాటుపడాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బెతస్థకాలనీ, మన్సూరాబాద్ చిన్నచెరువు ప్రాంగణంలో రూ.53 లక్షలతో చేపడుతున్న వరదనీటి నాలా పనులను ఆదివారం కార్పొరేటర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ చిన్నచెరువులోకి వర్షపునీరు వెళ్లకుండా దార్లు మూసుకుపోవడంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు తగ్గిపోయాయని, దీంతో చెరువు పరిసరాల్లోని అనేక కాలనీల్లో నీటి సమస్య తలెత్తిందన్నారు. చిన్నచెరువులోకి నీరు వెళ్లేలా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్ సహకారంతో వరదనీటి నాలా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో పరిసర కాలనీల సభ్యులు నాంపల్లి కృష్ణ, పృథ్విముదిరాజ్, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

వనస్థలిపురం,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉచిత ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ సుభద్రనగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

పంజాగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. ఆదివారం ఆలిండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) కేకేసీ విభాగం ప్రతినిధి లక్ష్మణ్, జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డిలు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు.


టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఏఐసీసీ కేకేసీ ప్రతినిధి లక్ష్మణ్, రవిశేఖర్‌రెడ్డి